ఆంధ్రమహిళ

సంపుటి 1 15 ఫిబ్రవరి 1945 సంచిక 19

★ మధురస్మృతి

'బా' అసువులను బాసి ఏడాది దాటింది. బాపుకు తోడునీడగా, మహిళలకు మార్గదర్శినిగా, జాతికి దివ్యజ్యోతిగా జీవితం వెలిగించి తుదకు కృష్ణజన్మస్థానంలో సంకెళ్ల బరువుకు డస్సి స్వర్గలోకప్రాప్తి చెందింది. సర్వస్వము మహాత్ముని దివ్యచిత్తానికి సమర్పించి ఆతని ఆదర్శ సఫలతకు సాయపడి అంధకార భూయిష్టమైన లోకానికి దారి తెన్ను చూపెట్టింది. ఆమె జీవించిన ప్రతి ఘడియ మహాత్ముని సత్యాగ్రహ సాధనకు నైవేద్యం చేసి ధన్యత చెందింది. ఆమె పవిత్ర జీవితం నారీలోకానికి వెన్నెలవెలుగు. అద్వితీయమైన సహనశక్తి, నమ్రత మూర్తీభవించిన పరమ సాధ్వి, అకుంఠిత ధైర్యస్థైర్యములను ప్రదర్శించిన ఆదర్శదేశసేవిక, కరుణామయి మాతృమూర్తి కస్తూర్బాకు కృతజ్ఞతాంజలులు.

★ ఆంధ్ర విశ్వవిద్యాలయం

ఆంధ్ర విశ్వవిద్యాలయ వుపాధ్యక్షుని ఎన్నిక యీ నెలలో జరుగుతుందని ప్రకటించారు. విజ్ఞానం వెదజల్లి జాతికి గౌరవ ప్రపత్తులను చేకూర్చేది విశ్వవిద్యాలయం. సమాజంయొక్క ప్రతిష్ఠ యీ విజ్ఞాన కేంద్రంయొక్క ఉత్కృష్టత పైననే ఆధారపడివుంటుంది. ఆంధ్రుల అదృష్టం పండి ఆంధ్ర విశ్వవిద్యాలయం రాధాకృష్ణన్ రామలింగారెడ్డిగార్ల పాలనలో పెరిగి పెద్దదయింది. జగత్ప్రఖ్యాతిగన్న యీ పండితులు అలంకరించిన వుపాధ్యక్షపీఠం ఎవరి హస్తగతమౌతుందో! విశ్వవిద్యాలయ వుపాధ్యక్షత ప్రభుత్వాన్ని నడిపే ప్రధానమంత్రిత్వంకన్న మహత్తరమైనది. వుపాధ్యక్షునకు పరిపాలనా నైపుణ్యం మాత్రం వుంటే చాలదు; పార్టీ ఓట్ల బలం ఆ హోదాకి అర్హత నియ్యదు. సెనేటు సభలో మాట దక్కించుకునేపాటి చాతుర్యం, యూనివర్శిటీ గుమాస్తాలపై అధికారం చలాయించ గలిగేశక్తి—యివి వుంటే మంచిదే కాని వుపాధ్యక్షభారం వహించడానికి ముఖ్యంగా సమాజంలో వైజ్ఞానికుడుగా వున్నతస్థానం అలంకరించివుండాలి; విద్యావ్యాప్తికి అపారమైన కృషి చేసి మేటిప్రబోధకుడుగా సంఘంలో స్థానం సంపాదించివుండాలి. వుపాధ్యక్షునకు యీ అర్హత లేనప్పుడు విశ్వవిద్యాలయం ప్రజల మన్నన పొందజాలదు; విద్యార్థుల విశ్వాసం, అనురాగం కరవైపోతాయి. ఆంధ్ర విశ్వవిద్యాల

యం యీ దుస్థితికి లోనుగాకుండా చూసేభారం సెనేటుసభ్యులపైన మోసివుంది. పార్టీ పోట్లాటలు సాగించడానికి, అధికారంసరదా తీర్చుకోడానికి యితర అవకాశాలు అనేకం వుండనే వున్నాయి. ఇతరత్రా—రాజకీయంగానో, సాంఘికంగానో—కూడగీసిన పలుకుబడిని వినియోగంచేసి విశ్వవిద్యాలయానికి అధ్యక్షత వహించడం సమంజసం కాదు. ఆంధ్రరాష్ట్రం లేకపోయినా ప్రత్యేక విశ్వవిద్యాలయం పొందగలిగామని ఆంధ్రులు గర్విస్తున్నారు. ఈ విశ్వవిద్యాలయాన్ని 'పవర్ పోలిటిక్స్'కి బలి యివ్వకుండా నిర్దుష్టమైన విజ్ఞాన కేంద్రంగా విజ్ఞులు పోషించగలుగుతారని ఆంధ్ర మహిళ ఆశిస్తోంది.

★ ఆంధ్రమహిళా జాతీయ విద్యాపీఠం

స్త్రీలలో జాతీయ విద్యాప్రబోధం చేస్తున్న సంస్థలు ఆంధ్రదేశంలో లెక్కకు మించివున్నాయి. విద్యాలయం అని పేరు లేకపోయినా ప్రతీ పట్టణంలోను నెలకొల్పబడివున్న స్త్రీ సంఘాలూ, క్లబ్బులూ వయోవతులలో విద్యాప్రబోధం చేస్తూనేవున్నాయి. మగవారి క్లబ్బులకీ స్త్రీల క్లబ్బులకీ యిదే తేడా. స్త్రీ సమాజాలు వృధా కాలక్షేపాలతో కాలం వెళ్లబుచ్చకుండా, తెలుగు, హిందీక్లాసులనీ, కుట్టుపని, ఎంబ్రాయిడరీ క్లాసులనీ వయోవతుల. కుపయుక్తమగు ప్రబోధం చేస్తూనేవున్నాయి. శారదా నికేతనం, వైశ్యసేవాసదనం, ఆంధ్రమహిళాసభ వంటి సంస్థలు మహిళా విద్యా కేంద్రాలుగా అభివృద్ధి పొంది ఆంధ్రజాతీయ వికాసానికి తోడ్పడుతున్నాయి. ఈ సంస్థల నిర్వాహకులు ఒక సంఘంగా సమావేశమౌతూ, సంప్రదించుకుంటూ ఒకరికొకరు సహకారం యిస్తూ కార్యక్రమం సాగిస్తే ఆశయసిద్ధి త్వరలో ప్రాప్తిస్తుంది. ఈ వుద్దేశంతోనే ఆంధ్రమహిళా విద్యాపీఠం స్థాపింపబడింది. రాష్ట్రంలో మహిళాసేవ చేస్తూన్న ప్రతీ సంస్థా విద్యాపీఠానికి శక్తివంచనలేకుండా సహకరిస్తుందని విశ్వసిస్తాం. వివిధ సంస్థలు ఆచరణలో పెట్టగల ఒక జాతీయవిద్యాప్రణాళికను తయారుచేయడానికి ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారిని కోరడమైనది. వారికి సలహాగా 'ప్రజామిత్ర' కొన్ని సూచనలను చేసింది. వాటిని ముందు సంచికలో ప్రకటించగలం. ప్రజామిత్రవారు సూచించిన రీతిని కస్తూర్బా స్మారకనిధి పల్లెలలో విద్యావ్యాప్తికై వినియోగపడగలదు. వాటి భాగ్యం పండింది. కాని పట్టణాల మాట? ఆంధ్రమహిళా విద్యాపీఠం యీ కొరతను తీర్చగలదు. ఆంధ్రుల దీవెనల నభిలషిస్తున్నాము.

★

★

ఆంధ్రమహిళా సభ భవననిర్మాణ నిధి

రు. 50,000 లు వసూలు చేయవలెనని తీర్మానం

చెన్నపట్నం ఆంధ్రుల పట్నం ! అయితేనేం? ఇది మా స్వంతభవనం అని చెప్పుకుని గర్వించడానికి యింతవరకూ యీ నగరంలోని ఏ ఆంధ్ర సంస్థా నోచుకోలేదు. ఆంధ్రాభ్యుదయానికి కృషి, చేసే సభలూ, సమాజాలూ యెన్నో వెలిసాయి, వృద్ధి పొందుతున్నాయి. కాని అవి అద్దె కొంపలలో తల దాచుకోవలసిన పరిస్థితులలో వున్నాయి. చెన్నపట్నం ఆంధ్రరాష్ట్రానికి ముఖ్య పట్నం ! అయితేనేం ? తమిళులు వారి సారస్వత సమాజాలకి స్వంతభవనాలు, పాటకచ్చేరీలకు స్వంతభవనాలు, క్లబ్బులకు, లైబ్రేరీలకు, పత్రికలకు—వారిచే పెంచి పోషింపబడే ప్రతీసంస్థకు, ఉద్యమానికీ స్వంతభవనం ! సుస్థిర నివాసం ! మరి మనం ఆంధ్రులం ! మదరాసులో జాతీయోద్యమం రేకెత్తించినది ఆంధ్రులు. కాని తమిళులకున్న కాంగ్రెసుభవనం మనకి లేదు. నాటకకళను పునరుద్ధరించి తీర్చి దిద్దినది ఆంధ్రులు. కాని మనకి తమిళులకున్న వి. పి. హాలు, న్యూ థియేటరు లేవు. ఇంతెందుకు, ఆంధ్రలోకానికి సర్వస్వం అర్పించిన దేశోద్ధారకుని స్మారకచిహ్నంగా ఒక భవనాన్నైనా నిర్మించలేకపోయాం ఆంధ్రులం ! మద్రాసు ఆంధ్రులనగరమే, కాని, ఆ నగరంలో ఆంధ్రులయే ఒక్కసంస్థకీ వసతిలేదు. ఇట్లాగే గడిచిపోయాయి రోజులన్నీని. ఈ పరిస్థితి సిగ్గుచేటుగానే వుంది ప్రతీ ఆంధ్రుడికీని—స్వగృహమే లేని రాజధానినగరం మామద్రాసు !........ ఈ నాటికి ఆంధ్రులు తలయెత్తుకోడానికి అవకాశం లభించింది. ఆంధ్రుల ప్రతిష్ఠ నిలబెట్టడానికి ఆంధ్రమహిళ మీర్జాపురం రాణీగారు సంసిద్ధులయ్యారు. ఆంధ్రమహిళలకు నాయకత్వాన్ని వహించి నూతనోత్సాహశక్తినిచ్చి యీమె పదహారువేలకిమ్మత్తుగల నివేశనస్థలం ఆంధ్రమహిళా సభకు విరాళంగాయిచ్చారు. ఆంధ్రులపట్నంలో ఆంధ్రులు ఆ నాటి కీనాడు నివేశనస్థల భాగ్యాన్ని పొందారు. ఆంధ్ర ప్రజాసంస్థలు మదరాసులో చిరాస్తిని సంపాదించుటకు యిదే ప్రథమం. భూరివిరాళాన్నిచ్చి ఆంధ్రాభ్యుదయానికి తోడ్పడింది, మా అధ్యక్షురాలు మీర్జాపురంరాణి. ఆమెకు ఆంధ్రులు సర్వదా కృతజ్ఞులుగావుంటారు........ఇల్లు అలకగానే పండగ పూర్తి కాదు. భవననిర్మాణానికి నివేశనస్థలం ప్రాతిపదిక మాత్రమే. మీర్జాపురం రాణీగారు యిచ్చిన భూరివిరాళానికి కృతజ్ఞత ప్రకటించాలంటే ఆంధ్రులు సర్వశక్తులనూ వినియోగించి ఒక దివ్యభవనాన్ని త్వరలో నిర్మించాలి. మహిళోద్యమవిజయానికి అద్వితీయమైన సేవచేస్తూన్న ఆంధ్రమహిళాసభకు ఆంధ్రప్రజ తోడ్పడి ఒక దివ్యభవనాన్ని కానుకగా అర్పించాలి. ఆ నాడే ఆంధ్రమహిళాసభ, ఆంధ్రలోకం సగర్వంగా-మన రాజధానిపట్టణంలో జీవితం గడపగలుగుతుంది. మా అధ్యక్షురాలు మీర్జాపురంరాణీగారి నాయకత్వంతో, ఆంధ్రసోదరుల ఆదరాభిమానాలతో ఆంధ్రమహిళాసభ భవననిర్మాణనిధికి రు. 50,000 లు సేకరించడం కష్టమైనపనికాదు.

ఈ నిరీక్ష సఫలాశయమొనర్చవలసిన బాధ్యత ఆంధ్రలోకం వహిస్తుందని విశ్వసిస్తున్నాం.

“ఆంధ్రుల ప్రతిష్ఠను కాపాడింది మా అధ్యక్షురాలు”

సర్వసభ్య సమావేశ తీర్మానాలు - నూతన కార్యనిర్వాహకవర్గపు ఎన్నికలు.



ఆంధ్రమహిళా సభ సర్వసభ్య సమావేశం ది 7-2-45 తేదీన శ్రీ మిర్జాపురం రాణీగారి అధ్యక్షతను జరిగింది. సభకు పలువురు సభ్యురాండ్రు దయచేసారు. ఈ దిగువ తీర్మానాలు యేకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి

5. గతసంవత్సరం జమాఖర్చులు, దసరా, తృతీయ వార్షికోత్సవం జమాఖర్చులు చదివి ఆమోదించడమైనది.

6. నూతన సంవత్సర కార్యక్రమమును కొనసాగించుటకు యీ క్రింది సభ్యురాండ్రు గల కార్యనిర్వాహకవర్గమును ఎన్నుకొనడమైనది.

శ్రీ మిర్జాపురం రాణి
అధ్యక్షురాలు.

శ్రీ రాణీరావు రాజ్యలక్ష్మి
శ్రీ వుయ్యూరు రాణి
ఉపాధ్యక్షురాండ్రు.

శ్రీమతి దుర్గాబాయి
ప్రధాన కార్యదర్శిని.

,, జమునాబాయి
సహాయ కార్యదర్శిని.

మిసెస్ బి. విశ్వనాధ్
శ్రీమతి జి. నిర్మలాదేవి
,, మామిడిపూడి వెంకమ్మ
,, కంబా మాణిక్యమ్మ
,, పురం అన్నపూర్ణమ్మ
,, రత్నాల కమలాబాయి
,, శివలెంక కామాక్షమ్మ
సభ్యురాండ్రు.

ంధ్రమహిళాసభ హాస్టలు కమిటీగా యీ క్రింది డను యెన్నుకొనడమైనది.

శ్రీమతి బి. కృష్ణవేణమ్మ
అధ్యక్షురాలు.

శ్రీ కే. సుశీల
,, జి. లీల
,, ఆర్. రమాబాయి.

ంరాలికి, సభ్యురాండ్రకు కార్యదర్శిని వందనము ంటి కార్యక్రమం ముగిసింది.

★

అర్జంటు పనా! ★

శ్రీమతి గాదె జానకిరాముడమ్మగారు.

"వెంటనే వెళ్లిపోవాలి. అర్జెంటు ఎంగేజిమెంటు ఒకటుంది... కాఫీ అయిందా?

"తువ్వాలు! తువ్వాలు!! అబ్బ! ఏ వస్తువు కావలసినా రెడీగా వుండదు కద!"

"ఎక్కడికి క్లబ్బుకేనా?"

"ఎక్కడికో ఒకక్కడికి. ఏదో ఎంగేజిమెంటు వుందని చెప్పాను కానూ"

"మాటింగా?"

"శ్రాద్ధం! ప్రతీ భోగట్టా నీకే కావాలి" తోవలోని బొగ్గులబుట్ట తన్నుతూ...

"మరి నా మాట వినిపించుకుందురూ..."

"కాఫీ యిల్లా తగలెయ్యి తరవాత చూద్దాం"

"కాస్త చక్కెర..." కప్పు అందిస్తూ.

"ఊఁ...ఒరేయి- బండి కట్టరా?"

"ఏం హడావిడి, అబ్బబ్బ"

"అర్జెంటు ఎంగేజ్ మెంటు" చేతికర్ర పట్టుకుని మేడ మెట్లుదిగుతూ...

కాని—అంతలో పక్క డాబామీదనుంచి కోకిల కంఠంతో పాట—

"ధీరె ధీరె - ఆరె - బాదల్ ధీరె
ఆరె - బాదల్, ధీరే ధీరే జా."

ఠక్కున ఆగి, వెనక్కి తిరిగాడు.

మేరె బుల్ బుల్ సోరహాహై
షోరుగుల్న మచా"

"అచ్ఛా! బాగా పాడుతోందమ్మాయి" అని చేతికర్రతో భూమిమీద లయవేస్తూ నుంచున్నాడు వూగుతూ.

"అర్జంటు ఎంగేజిమెంటులన్నీ ఇప్పు డొక్కసారిగ మాయమైపోయినట్టున్నాయి" అని నవ్వుతూ అంది ఆ కోకిల కంఠం. డాబామీదవున్న అమ్మాయి అతనికి కనిపించింది.

ఆమెనలాచూస్తూ బాహ్యప్రపంచం మరచాడు. అతనికి తెలీకుండానే అతని పెదవుల్లోంచి చిన్న మందహాసంపైకి ఉబికింది. ఇంతలోనే డాబామీదనుంచి ఇంకో పదహారేళ్ల అమ్మాయి ఆ పిట్టగోడ దగ్గరికొచ్చి, కిందనున్న జంతువుని చూసింది. ఇద్దరూ ఫక్కున నవ్వుకున్నారు. రెండో అమ్మాయి నవ్వు నాపుకుంటూ,

"మేరి లైలా - కోని - బాబల్
తూ నజర్ - న - లగా - ప్రీ బాదల్
తూ నజర్ - న - లగా"

అని కిలకిల నవ్వింది.

మోహనరావు చూపులు మాత్రం డాబామీదనుంచి తిరిగి రాలేదు:

చేతికర్రా వేషంతో డాబావంక రెప్పవెయ్యకుండా చూస్తూన్న భర్తని చూసి, "అవతల అర్జంటు ఎంగేజిమెంటు మించుకుపోతూందని అంత తొందరపడి, చివరకి ఇలా నిలబడిపోయేరేమిటి!" అన్నది కాస్త ఆశ్చర్యాన్ని నటిస్తూ:

మోహనరావు తలని మామూలుగ తీసుకవచ్చాడు.

"ఏమిటాలోచిస్తున్నారు?"

"ఆ అమ్మాయి ఎవరో ఈ వైపు చూసి నవ్వింది సుమా! నిజంగా ఆ నవ్వులో నవరత్నాలు రాల్తున్నాయంటే నమ్ము-కాని ఎందుకు నవ్విందా అని ఆలోచిస్తున్నాను."

భర్త మాటలు విన్నాక పద్మావతికి నవ్వొచ్చింది. "ఏముందీ, మీ వాలకం చూసి నవ్వి వుంటుంది." అంది నవ్వు నాపుకుంటూ.

"అంటే—నా వాలకం అంత నవ్వుతాలుగ వుందనా అర్థం!"

—డాబామీదనుంచి మళ్లీ పాట వినవస్తూంది. మోహనరావు కళ్లు డాబావేపు తిరిగాయి.

"చుపకె చుపకె కహా రహా హై
తుజసే మేరా దిల్
ఆగయిూదేఖో ముసాఫిర్ ప్యారకి మంజిల్."

మోహనరావు భార్యవేపుచూసి మెల్లగా, "ఆ ఈజీచైరు ఇలా వెయ్యి" అన్నాడు.

"అటు తొందరపని—"

"వేద్దూ అడ్డు ప్రశ్నలు వెయ్యక."

పద్మావతి ఈజీచైరు వసారాలో వేస్తూ, "పాపం అటు చూస్తే అర్జంటుపని-ఇటు చూస్తే నవ్వులరాణి—" అంది కాస్త కళ్లు తిప్పుతూ.

"అబ్బ! నువ్వో ఘడియ నోరు మూసుకోలేవ్వూ?" అంటూ ఈజీచైరులో కూర్చుని డాబావైపు చూస్తూ చేరగిలబడ్డాడు.

"అదికాదు గానీ, మాటకడుగుతున్నాను, అర్జంటు—"

"అబ్బబ్బబ్బ! చంపేస్తున్నావే, ఒకటేగోల. నాకు తెలీదూ అర్జంటుపనుంటే వెళ్ళాలని ?"

"అంటే అర్జంటుపని లేదన్నమాట - లేకపోతే అంత ముఖ్యమయినపని ముంచుకొని రావడంవల్ల———"

పక్క డాబామీదన వాలుజడ ఒకసారి కన్పించి మాయమయింది.

చిన్న కిలకిల స్వరం, మళ్ళీపాట. ఈ సారి ఇద్దరమ్మాయిలు కలిసేపాట.

"దోదినోంకి ఏ కహానీ
తూఫి సున్తాజా, ఓ బాదల్
తూఫి సున్తాజా"

మళ్ళీ నవ్వులు—తర్వాత గబగబ నడచిన పదధ్వనులు—మెట్లు దిగినచప్పుడు.

కూరజంగిడా, కత్తిపీటా దగ్గరకి లాక్కుంటూ, "దిగిపోయారు. ఇహ మీరు వెళ్లొచ్చు" అంది పద్మావతి చిన్న నవ్వు నాపుకుంటూ.

ఆ మాటకి భార్యవేపు ఉరిమిచూస్తూ, "వెళ్లవచ్చా! రాణిగారి ఆజ్ఞ అయిందా! అనవసర ప్రసంగం నువ్వూను."

అంటూ మోహనరావు కుర్చీమీదనుంచి చేతికర్ర నోసారి భూమ్మీద బలంగా కొట్టి చరచర వీధిలోనికి వెళ్లి పోయాడు.

మరో నిమిషానికే రెండిళ్లకూ మధ్యనున్న పెరటితలుపు తెరుచుకొని ఆ ఇద్దరమ్మాయిలు వచ్చారు.

"నువ్వటే లలితా ? ఎవరో అనుకున్నాను. మీ యిద్దరి గొంతుకా కలిసింది" అంది పద్మావతి.

"మీ దంపతులిద్దరికీ ఇవాళ మేం కలహకారణం అయినామేమో అని భయపడుతున్నాం" అంది ఆ అమ్మాయి.

"అబ్బే! కారణం లేనిదే మా వారు బుస్సుమంటూంటారు. అది ఆయన సైజం—" అని నవ్వింది పద్మావతి.

శారద అంటుకుంది—"అయినా ఈ మొగవారంతా ఒకటే రకమండీ. ఇంట్లోవున్నామెను దేనికో దానికి ఏడ్పించుకొని తినడం, ఇరుగుపొరుగు అమ్మాయిలు కంట్న పడితే మాత్రం—

"మీసా లెగదువ్వి లొట్టలు వేయడం" అని పకపక నవ్వింది లలిత.



కళలు స్త్రీల ఆభరణములు. ఆంధ్ర మహిళా సభ కళాశాఖ విద్యార్థినులు

ప్రేమ వివాహాలు ★ శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు.

ప్రేమ వివాహాలూ, వాటికి సంబంధించిన సమస్యలూ మన సంఘాన్ని ఈ నాటివరకూ బాధించకపోయినా మన ముందు తరం వాళ్లకి ప్రేమ వివాహాల సమస్య ఏర్పడితీరుతుంది. ఆ సమస్య వాళ్లకి తెచ్చిపెట్టే కష్ట సుఖాలుగురించి మనం తెలుసుకుని ఉండటం వ్యర్థంకాదు.

వివాహం ద్వారామనం ఏ యే సుఖాలు ఆశించి ఉండినా క్రియకు పెళ్లి మనకొక ఆశ్రమధర్మం కిందనే జమ అయి ఉండింది. మన తరంవాళ్లం పూర్వీకులకంటె ప్రేమనుగురించి ఎక్కువగా చదివి ఆలోచించామేగాని పెళ్లి చేసుకునే విషయంలో పూర్వీకులకన్న భిన్నమైన మార్గాలు తొక్కి ఉండలేదు. ఎక్కడైనా ఒకరు ముందుగానే తాము కట్టుకోబోయేవారిని చూచుకుని ఆమోదించటం ఆచరణలోకి వచ్చినప్పటికీ అందువల్ల వివాహ తంత్రంలో మార్పేమీలేదు.

ముందు రాబోయే తరంవాళ్లు—ఇప్పుడు పుట్టి పెరుగుతున్నవారిలో చాలామంది—ఈ రకం పెళ్లిళ్లతో తృప్తి పడరని మనంగట్టిగా నమ్మవచ్చు. వాళ్లు తమ భార్యల్ని భర్తల్ని మొహాలుమటుకే చూసి పెళ్లి చేసుకోరు. వారి పరిచయం ముందుగా కోరతారు. ప్రేమించి పెళ్లాడే హక్కువెంట, వారికి పెళ్లాడే వారి పరిచయం చేసుకునే హక్కుకూడా సంప్రాప్తమవుతుంది.

హక్కులు చాలా విచిత్రమైనవి. వాటి సరిహద్దులు నిర్ణయించటం సులభంకాదు. ప్రేమించి పెళ్లాడే హక్కువెంబడి పెళ్లాడే మనిషి పరిచయం చేసుకునే హక్కు ఏర్పడ్డట్టే, ఒక్క పెళ్లాడే వాడితోనేగాక పెళ్లాడటానికి అర్హతగలవా రందరితోటీ పరిచయం చేసుకునే హక్కుకూడా ఏర్పడుతుంది. ఆ విధంగానే ప్రేమించి పెళ్లాడే హక్కువెంబడే, ప్రేమించకుండానే అవతలివ్యక్తియొక్క డబ్బో పదవో కోరి ఆ మనిషియొక్క ప్రేమను ఏమాయోపాయం చేతనైనాసరే సంపాదించే హక్కుకూడా ఏర్పడుతుంది. ప్రతి హక్కువెంటా దాన్ని దుర్వినియోగపరిచే అవకాశాలుంటూ ఉంటై. వాటిని అరికట్టటానికి

ఎప్పుడూ వీలుండదు. ఆవంకపెట్టి మనుష్యులకు ప్రేమించి పెళ్లాడే హక్కు లేకుండా చెయ్యాలని వాదించటం మూఢత్వం. ఇటువంటి మూఢత్వంలో పడకుండా ఉండటం మనం చెయ్యదగిన మొదటి పని. అటువంటి మూఢత్వంలోనే పడదలిస్తే మనిషికి ఏ హక్కు ఉండదనేది మరవ రాదు.

ఇక ప్రేమ వివాహాలు చేసుకునేవారి కష్ట సుఖాలు విచారింతాం. వాళ్లకి పెద్ద చిక్కు ప్రేమతోనే వస్తుంది. ప్రేమ వ్యక్తుల మనస్తత్వాన్ని బట్టి, ఉదారంగానూ, ఉత్తేజకంగానూ, భయంకరంగానూ, వెకిలిగానూ, యేహ్యంగానూ, హాస్యాస్పదంగానూ పరిణమిస్తుందని ఎవరు అన్నారు. దానికి కారణం శాస్త్రీయంగా మనం ఊహించవచ్చును. ప్రేమ అనేది కామప్రేరణననుసరించి కలిగే ఒక భావం. కాని అది ఇతర ప్రేరణలకీ, వాటిననుసరించికలిగే భావాలకీ సంబంధంకలిగి ఉండేది. అన్ని ప్రేరణలూ అందరు వ్యక్తులలోనూ ఒక విధమైన పరిణతిపొందవు. కొందరిలో కొన్ని ప్రేరణలు ప్రకోపించి ఉంటై. కొన్ని ప్రేరణలు వికటించి ఉంటై. కొన్ని ప్రేరణలు ఆరోగ్యవంతంగా ఉంటై. కొన్ని అణచబడి ఉంటై. వాటిననుసరించి ఉండే భావాలుకూడా అంతే.

ఆత్మరక్షణ తీసుకుంటే అదివికటించిన మనిషికి జాస్తిగా పోట్లాడే స్వభావం ఉంటుంది. అణిచిపెట్టి ఉంటే అసహాయత్వం ఏర్పడుతుంది. అది ప్రకోపించినప్పుడు ఆ మనిషి జీవితంలో పోరాటం ప్రధానాంశంగా ఉంటుంది.

ఆ విధంగానే అర్థ ప్రేరణలో మార్పులవల్ల మనుషులు తిండిపోతులు కావటమూ, లోభులుకావటము, జూదగాళ్లు కావటము, ద్రోహులు కావటమూ బైరాగులుగా తిరగటమూ మొదలైనవి జరుగుతై.

కామ ప్రేరణ మనుష్యుల్ని మితిమీరిన ఇంద్రియలోలత్వానికీ, కఠిన బ్రహ్మచర్యానికీ, అవి నీతికీ, అనవసరనీతికీ, పశుత్వానికీ పురికొల్పుతుంది.

అట్లాగే మాతృత్వం కఠినత్వానికీ, పక్షపాతానికీ, అర్థం లేని దాతృత్వానికీ, పిరికితనానికీ, త్యాగానికీ, సేవకూ దార్లు తీస్తుంది.

ప్రేమ భావాన్ని ఇన్నిరకాల భావాలతోనూ జోడించినప్పుడు దానికి రకరకాల విలవలు ఏర్పడటం వింత ఏమీ లేదు.

ఈ సమస్య మరింతక్లిష్టం కావటానికి మరో కారణం ఏమంటే కేవల కామ సంతృప్తి విషయంలోనే మనుష్య మృగం సంపాదించుకున్న రకరకాల అసమర్థతలు. మిగిలిన మృగాలకి భావాలులేక పోవటమేగాక కామ సంతృప్తి విషయం అనుమానానికి తావులేదు. మనిషికిదే ఒక భయంకరమైన సమస్య. ఈ సమస్య లేనట్టు నటించటం మూలాన మరింతగడ్డు సమస్యగా పరిణమించింది.

ఈ పరిస్థితులలో మనం మన తరువాత వాళ్ల వివాహ సమస్యనుగురించి ఏంచెయ్యగలం? వాళ్లకి మనం చెయ్యగల సహాయం ఏమిటి? మర్మ శాస్త్రాలు చదివి కొంత జ్ఞానం సంపాదించుకోనిచ్చిన తరవాత కూడావాళ్లకి చాలా చిక్కులున్నై. ఇంతకు పూర్వం చెప్పినట్టుగా వాళ్ల ప్రేమలు ఘోరంగానూ, భయంకరంగానూ, వెకిలిగానూ, హాస్యాస్పదంగానూ, పరిణమించకుండా ఉదారంగా, ఉత్తేజకంగా పరిణమించేటట్టు చూసేబాధ్యత మనమీద ఉన్నది. అనగా వాళ్ల ప్రేమ వివాహాలకి సరి అయిన ఆరోగ్యవాతావరణం కల్పించే బాధ్యత మనమీద ఉన్నది.

దానికిగాను మనం శక్తివంచనలేకుండా చెయ్యదగిన సదుపాయాలలో మొట్టమొదటిది మన పిల్లల్లో ప్రేరణలు వికటించకుండానూ, అకారణంగా హద్దుమీరి ప్రకోపించకుండానూ చూడటం మన పని.

రెండవ విషయం——వివాహోన్ముఖులుగా ఉండేవారిలో కామ ప్రేరణ ఎట్లాగూ ప్రకోపించి ఉండనే ఉంటుంది గనక ప్రేమకు——కామ పరమైన ప్రేమకు——అనవసర ప్రాముఖ్యం ఇవ్వనవసరంలేదు. అంతకంటె చెయ్యదగిన దేమంటే ప్రేమ భావానికి మిగిలిన ప్రేరణలతోగల సంబంధాన్ని పిల్లలకి తగుమాత్రం బోధించటం. ఇది సక్రమంగా చెయ్యని పక్షంలో యౌవనాని కనవసరమైన ప్రాముఖ్యం ఇచ్చి ప్రతి మనిషీ——ముఖ్యంగా ప్రతి ఆడదీ——యౌవనాన్ని వార్థక్యం దాకా పొడుగించటానికిగాను పిల్లల్ని కనకా, కన్న పిల్లలకి పాలిచ్చి పెంచకా, అలంకరణల మీద అహోరాత్రాలు వ్యర్థంచేసే, ఈ నాటి పాశ్చాత్య సమాజానికి మనంకూడా ప్రతిగా తయారయే అవకాశం ఉంది. ఇది సంఘానికి శ్రేయస్కరమనిగాని వ్యక్తుల అభివృద్ధికి అవసరమనిగాని అనుకోనవసరంలేదు. ఆరోగ్య కారణాలూ, ఆర్థిక కారణాలూదాటి వెళ్లినప్పుడే ఈ అభ్యాసాలు వ్యక్తికీ జాతికీకూడా అపకారము.

మనమాదిరిగా వెనకపడి ఉన్న దేశాలు అభ్యుదయం సాధించాలంటే రెండు నేర్చుకోవాలి: ఒకటి, లేని హక్కులు సంపాదించటమూ. రెండు, వాటిని సక్రమంగా వినియోగపరచుకునే విధానాలు అన్వేషించటమూనూ. ప్రపంచమంతటా ఏర్పడిన ప్రేమ వివాహాలు మన దేశంలో ఏర్పడే సూచనలు లేక పోవటం శోచనీయం. కాని ఇటువంటివి కేవలమూ అనుకరణద్వారా రావటంకన్న బుద్ధిపూర్వకంగా జ్ఞానోదయం ద్వారా రావటం చాలా శ్రేయస్కరం. దానికిగాను దేశంలో ఉన్న విద్యాధికులంతా పాటుపడవలసి ఉంటుంది. ఇటువంటి మార్పులను సహించని బానిసత్వాన్ని కష్టపడి సంస్కరించవలసి ఉంటుంది. అటు పిమ్మట ఈ కొత్త సంస్కరణకు అనుకూలమైన వాతావరణం ఏర్పరచవలసి ఉంటుంది. మానవుడూ, మానవసంఘాలూ కేవలం ఉద్రేకాలద్వారా పరిణామంచెందలేవు. ముమ్మాటికీ ఇది అసంభవం. మానవ పరిణామానికి జ్ఞానం తప్ప మరో మార్గంలేదు.



S. S. S.

కొద్ది మొత్తములు కూడబెట్టే పద్ధతి

అధికారము పొందిన ఏజంటుగా ఎందుకు ఉండకూడదు ?

నేషనల్ సేవింగ్సు సర్టిఫికెట్లను

2½% కమీషనుమీద అమ్మండి. మీరు తీరిక సమయాల్లో పనిచేసినా పూర్తిగా ఇందుకే పనిచేసినా చక్కగా ఆర్జించవచ్చు.

అమ్మిన ఒక్కొక్క రు. 10 ల సర్టిఫికెట్టుకూ అ. 4 వస్తుంది.

మీ రీ ఉద్యోగం కావాలనుకుంటే ఈ క్రింది వివరాలను మీరు బయటిజిల్లాలలో ఉంటే మీ కలక్టరుకుగాని, మద్రాసు పట్టణంలో ఉంటే నేషనల్ సేవింగ్సు సర్కిల్ ఆఫీసరు, 'విక్టరీహౌస్' మద్రాసుకుగాని వ్రాయండి.

1. పేరు, అడ్రసు. 2. వయసు. 3. మీకు స్థిరాస్తి ఏమైనా ఉంటే అది ఏమి? ఎచ్చట ఉన్నది. 4. లేకపోతే మీరే గవర్నమెంటు అధికారులకు స్వయముగా తెలిసియున్నారు. 5. లేకపోతే రిఫరెన్సుకు తగిన ఇతర పేర్లను, అడ్రసులను ఇవ్వండి. 6. విద్యాయోగ్యతలు. 7. ఇప్పుడేమైన ఉద్యోగముంటే, అది.

కథానిక :

కారో

అనువాదం :
శ్రీమతి కొ. వీరలక్ష్మిగారు

[ఇది రష్యన్ కథ. నిజంగా జరిగింది. 1879 డిసెంబర్‌నెల "థియసఫిస్ట్" పత్రికలో హెచ్. పి. బ్లావెస్కీచే ప్రచురితమయింది. అంతకు ముందు మెసంజర్ ఆఫ్ ఒడెస్సా పత్రికలో ప్రకటించబడింది. ఈ సంఘటన తన జీవితంలోని ఒక అనుభవమని ఒక ఉన్నత రష్యన్ సైనికోద్యోగి చెప్పడంవల్ల ప్రచురించబడినట్లు "థియసఫిస్ట్" వ్రాసింది. ఆధ్యాత్మిక శక్తులంటే నమ్మకగలవారికి ఆమోదకరంగా వుంటుందని దానిని ప్రచురిస్తున్నాం.—సం॥]

టర్కీలో గతసంగ్రామం జరుగుతున్న సమయంలో క్రిస్మస్ రోజున బుఖారెస్ట్‌లోని ఒక హోటల్‌లో కొంత మంది సైనికోద్యోగులు గుమి గూడారు. అంతా ఒక కర్నల్ (పేరెందుకులెండి) గదిలో కూర్చున్నారు. వారిలో న్యూయార్క్ హెరాల్డ్ విలేఖరి, లండన్ టైమ్సు విలేఖరి, ఒక కెప్టెన్, రెడ్‌క్రాస్ ఉద్యోగి ఒకాయన వున్నారు. కర్నల్ భార్య, టేబిల్ చుట్టు కూర్చున్నవారందరికీ టీ ఇస్తున్నది. అంతా నవ్వుతూ ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఆ సంభాషణలో పాల్గొనక ఏదో యోచనాధీనులై వున్నట్లు కూర్చున్నది పత్రికా విలేఖరులు.

కర్నల్ ఇలా అన్నాడు.

"ఏం లిట్టన్! అలా కూర్చున్నావు?"

"మరేంలేదు. స్వదేశంమీదికి పోయింది మనస్సు. ఇంట్లో మా అమ్మ, నాయన అందరూ ఇప్పుడు ఏం చేస్తూ వుంటారా అని యోచిస్తున్నా."

"ఏం చేస్తువుంటారు. భోజనాలుచేసి మనల్నిగురించో, ఆస్తి పాస్తుల్నిగురించో, దయ్యాలనుగురించో సంభాషణలు జరుపుతూవుంటారు" అన్నాడు మెక్ గహాన్.

కెప్టెన్ దయ్యాలన్నమాట వినగనే ముఖం వెల్లనయింది. అతడు తటాలున లేచి తన గదిలోకి వెళ్లి తిరిగివచ్చి అన్నాడు.

"దయ్యం అంటే నా ఒళ్లు ఝల్లుమంటుంది. మీరు నమ్మినా నమ్మకున్నా సరేగాని, నా జీవితంలో కొన్ని నెలల క్రితం జరిగిన ఒక సంఘటన మరువలేను" అన్నాడు కెప్టెన్.

మేమంతా చెప్పమనగా ఆయన ఇలా చెప్పాడు: (ఆ కథనాన్నే ఆయన తనకు వ్రాసి పంపించినట్లు బ్లావిస్కీ ప్రకటిస్తున్నాడు.)

"కాకాసస్ పర్వతాలలో యుద్ధం జరుగుతున్న సమయాన పర్వతప్రాంతాలలో విప్లవం రేగింది. ఆ విప్లవం రేపినవారినణగద్రొక్కడానికి కొన్ని సైన్య దళాలు పంపించబడ్డాయి. ఒక దళంలో నేనుకూడా వున్నాను. ఆ సమయంలోనే ఇంపీరియల్ గార్డ్స్ దళంనుంచి నెడ్విచ్ అన్న ఒక సైనికుడు మాదళానికి ట్రాన్స్‌ఫర్ చెయ్యబడినాడు. అతడు యువకుడు. ఎంతో అందంగావుండేవాడు.

నెడ్విచ్‌ను అంతా ఎంతో ఇష్టంతో చూచే వాళ్లం. అతని దగ్గర ఒక పెద్ద శునకం వుండేది. నల్లటిరంగు—నుదురుపైన నక్షత్రంలా తెల్లని మచ్చవున్న ఆ కుక్కనతడు 'కారో' అని పిలిచేవాడు.

ఒకసారి సిర్కేషియా ప్రాంతంలోని ఒక గ్రామంపై మేము ముట్టడికి వెళ్లాం. పర్వత ప్రాంతాలలోని విప్లవకారులు అత్యంత శౌర్యసాహసాలతో ప్రతిఘటింపసాగారు. సైనికులు మదోన్మాదుల్లా ఆ విప్లవకారులను చంపివేసేవారు. నెడ్విచ్ ఒక సైనికనివహానికినాయకుడై యుద్ధరంగంలో వీర విహారం చెయ్యసాగినాడు. ఒక ఇంటిముంగిట మే మిద్దరమూ తారసిల్లాం.

అతడు ఒక వృద్ధుని పట్టుకుని చిత్రవధ చేస్తున్నాడు. అతనికళ్లలో సౌందర్యంకాదు, పైశాచికత తాండవించింది. ఆతనిలో ఆక్రౌర్యం చూచి నేను విస్తుపోయాను. ఇంతలో ఆ ఇంటి లోపలనుంచి ఒక పద్ధెనిమిదేళ్ల యువతి అయి వుంటుంది, తళుక్కుమని మెరుపులా ఈవలకు వచ్చింది.

ఆ వృద్ధుని మృతకళేబరంపై పడిఏడ్వసాగింది. ఆ సౌందర్య మూర్తిని చూసి సెడ్విచ్ చకితుడైనాడు. గజగజవణికి పోయాడు. ఆమె మావంక ఒకసారి చూసి తల వంచుకుంది.

రెండు రోజుల తరువాత ఆ యువతి సెడ్విచ్ గుడారం దగ్గరకువచ్చి, ఆతని పాదాలపై పడిందట. అతని శౌర్యానికి తను దాసురాలనని, తనను పెళ్లిచేసుకొనమని బ్రతిమాలిందట. నేను ముందు నమ్మలేకపోయాను ఈ మాట.

ఆ గ్రామంలో విప్లవం అణగిపోయినతరవాత మా సేనాని ఒక పర్వత పాదందగ్గర మేము కొన్ని రోజులు వేచి వుండాలన్నాడు. మరి మాకు వేరే పని లేక ఆ రోజులు కులాసాగా గడిపేవాళ్లం.

ఒకనాటి సాయంకాలం నేను నా కుక్కను, తుపాకిని వెంట బెట్టుకుని షికారు బయలు దేరాను. ఆ లిడాగ్ అనే పర్వతంవుందక్కడ. ఆ పర్వత శిఖరంనుంచి సూర్యాస్తమయాన్ని చూద్దామని నాకోరిక. తోటలగుండా--మధుర ప్రకృతి వాతావరణంలో రెండుమూడుమైళ్లు నడచి, ఒక చిన్న ఏరు చేరుకున్నా. ఆగట్టున నాకు సెడ్విచ్ కనిపించాడు. అతని ప్రక్కనే చారెడేసి కళ్ళతో—ఆనాడునాకు కనిపించిన యువతి వుంది. నేను వారి ఆనందానికి భంగం కలిగించాలనిలేక అతిమెల్లగా పర్వతశిఖరం చేరుకున్నాను.

ఇంతలో ప్రక్కనే అలికిడిఅయింది. తలఎత్తి చూశాను. ముగ్గురు విరోధులు సాయుధులై పర్వతానికి దిగువను కనిపించి తటాలున మాయమైనారు.

చాలా ఆలస్యంగా నేను క్యాంపుకు వచ్చాను. అక్కడ సైనికులంతా గుమిగూడివున్నారు. ఏదో ఆందోళన వారి ముఖాలలో ప్రస్ఫుటమయింది. నేను దగ్గరకు వెళ్ళినాను. సెడ్విచ్ ఒకబల్లపై రక్తపుముద్దవలె పడివున్నాడు. అతడు చనిపోయినాడు. శరీరమంతా గాయాలే. అతని ప్రక్కనే కారో నిలబడివుంది. రెండుమూడుగాయాలనుంచి ఆకుక్కకు కూడా రుధిరం స్రవిస్తున్నది.

నేను గ్రహించాను. నాకు కనిపించిన ముగ్గురు విప్లవకారులే అతణ్ణి చంపివేశారు. ఆపిల్లను తమతో తీసుకొని పోయి వుంటారు.

కారో, క్యాంపుదగ్గరకు వచ్చి సైనికులను పట్టుకొని తనతో రమ్మని ఆహ్వానించినట్లు లాగ సాగిందట. దాని ఒంటిపైరక్తం, గాయాలనుచూసి, సైనికులుకూడా వెళ్ళారు. మరణించిపడివున్న సెడ్విచ్‌నుచూసి, గొనివచ్చారు.

అతనికి వీరోచితంగా అంత్యక్రియలు నెరవేర్చారు. అప్పటినుంచి ఆ కుక్కను వారు ఎంతో మక్కువతో చూసేవారు. అదికూడా వారిని ఒకక్షణం విడిచి ఉండేది కాదు.

ఒకవిరోధి సైనికుడు చివరకు కుక్కను తుపాకితో కాల్చివేశాడు. సైనికులంతా ఎంతో విచారించారు. దానిని ఒక చోట పాతిపెట్టారు. ఆరాత్రి ఒక్కరు భోజనం చెయ్యలేదు.

"పద్దెనిమిదేళ్ళు గడచిపోయినై. మళ్ళీ ఇప్పుడు జరుగుతున్న యుద్ధంలో నేను ఆర్మీనియాకు పంపబడినాను. నా రెజిమెంట్‌ను ఆగస్టులో చేరుకొన్నాను. కాకేషియన్ సైనికులతో నేను కిజిల్ తాపా దగ్గర మకాంవేశాను. మా క్యాంపులో సైనికులలో కట్టుబాటు ఎక్కువగాలేదని గ్రహించాను. అప్పుడప్పుడు టర్కిష్ అశ్వికదళాలు రాత్రివేళలలో వచ్చి అగ్రస్థానాలను వశపరుచుకుంటూవుండేవి. ఆగస్టు 13వ తేదిని 'కిజిల్ తాపా' మిట్టనుకూడా పట్టుకున్నాయి.

దానితో మా సైన్యంలో ఒకసారిగా కట్టుబాట్లు హెచ్చిపోయినవి. సైనికుడు ఏ మాత్రం అలక్ష్యంగా వున్నా మరణ శిక్ష విధించ బడేది. అప్పటికే గస్తీ సైనికులు నిద్ర పోతూనేవుంటున్నారని వార్తలువచ్చేవి. ఆ సమయంలో ఎవరైనా ఉద్యోగి ఆ ప్రాంతానికి వెళితే ఒక నల్ల కుక్క ఆ సైనికుని కాలు పట్టుకలాగేదని—అతడు లేవగానే తనకు ఏమీ తెలియనట్లు తోక ఆడిస్తూ అటు ఇటు తిరిగేదని సైనికులు చెప్పసాగారు. దాని పేరు కారో అని, కాకేషియన్ యుద్ధంలో చనిపోయిన ఒక సైనికోద్యోగి కుక్క దయ్యమయి ఇలా వస్తున్నదనీ చెప్పేవారు.

నాకు 18 ఏళ్లనాటి మాట వెంటనే స్ఫురణకు వచ్చింది. మా సేనాని 'ఏ సైనికుడైనా సరే నిద్ర పోతూవుండగా కనిపిస్తే కాల్చి చంపి వేయ' మని ఉత్తరువు చేశాడు.

కుక్క దయ్యంకావడ మేమిటి, ఆ దయ్యాన్ని నేనే కాల్చిచంపివేస్తానని రివాల్వర్ నిండా తోటాలు దట్టించి బయలుదేరాడు సేనాని.

ఆ కుక్క మాట వింతగాతోచి నేను కూడా బయలుదేరాను.

అది వెన్నెలరాత్రి. సుధాకరుని కిరణాలు పడి ఆలాడ్జిన్ పర్వత శిఖరాలు వెండి కొండల్లా మెరుపిస్తున్నాయి. మా శిబిరంలోను, శత్రు శిబిరంలోను నిస్తబ్ధత తాండవిస్తున్నది. దూరాన ఎక్కడో అప్పుడప్పుడు వోల్వింకా (గైటార్ వంటి జంత్రవాద్యం) తీగలుమీటుతున్న ధ్వని వినిపిస్తున్నది.

మేము ఒకమిట్ట నెక్కాము. గస్తీ సైనికులు చాలా మంది వున్న ప్రదేశమది.

పొదలమాటునుంచి మెల్లగా వెళ్ళుతున్నామేమో, గస్తీకాస్తున్న మా సైనికులు ఎవరూ మమ్మల్ని చూడడానికి అవకాశం లేకుండా వుంది.

మాకు నూరుగజాల దూరంలో ఒక సైనికుడు నిద్రపోతున్నట్లు స్పష్టంగా కనిపించింది. వెన్వెంటనే ఎక్కణ్ణుంచి వచ్చిందో ఒక పెద్దకుక్క నల్లగావుంది—ఆ సైనికుని కాళ్ళుపట్టి లాగసాగింది. అదే నెడ్విచ్ శునకమని నేను వెంటనే గ్రహించాను. నాహృదయంలో ఏదో ఉద్వేగం బయలుదేరింది. ఇంతలో 'ధాం' మ్మని రివాల్వరు ప్రేలింది. సేనాని ఆ కుక్కపై గురిచూచి రివాల్వరు ప్రేల్చాడు. గస్తీ సైనికుడు తక్షణం నేలకూలాడు.

అందరమూ ఒక్క పరుగున అక్కడకు వెళ్లాం. సేనాని గుర్రం మీదినుంచి క్రిందికి దిగి, ఆ సైనికుణ్ణి లేవనెత్తాడు. ఏమిచూశాడో తానుకూడా కెవ్వున కేకవేసి స్మృతి తప్పి పడిపోయాడు.

ఆ చనిపోయినది సేనానికొడుకు. ఆ యువకుడు వలంటీర్‌గాచేరి కొన్నిరోజులే అయింది. గస్తీ చర్యలకు పంపబడ్డాడు. తండ్రి చేతిలోనే దుర్మరణం పొందాడు పాపం.

ఈ విషాధ సంఘటన జరిగినపిదప 'కారో' మళ్లీ కని కనిపించలేదు, ఏమయిందో కాని.

★

మహిళా సేవ

కస్తూర్బా గాంధి స్మారకచిహ్నంగా ఆంధ్రదేశంలో స్థాపింపబడే మహిళాసేవా కేంద్రాలు నిర్వహించుటకు, పల్లెలలో జాతీయవిద్యా ప్రబోధంచేయుటకు స్త్రీలకు తర్ఫీదునిచ్చే శిక్షణాలయం సేవాగ్రామం (వార్ధా)లో ఫిబ్రవరి 22-వ తేదీన ప్రారంభమౌతుంది. శిక్షణ ఆరువారములు. ఈ కేంద్రంలో శిక్షణ పొందుటకు ముగ్గురు స్త్రీలను ఆంధ్రకమటీవారు సేవాగ్రామం పంపుటకు నిశ్చయించారు. విద్యార్థినుల ఖర్చులను కమిటీవారే భరిస్తారు. వయస్సు, చిరునామా, అనుభవము, భాషాపరిజ్ఞానము, సంఘానికి యీ వరలోచేసిన సేవ మొదలగు వివరములతో స్త్రీలు దరఖాస్తు యీ క్రింది చిరునామాకు పంప ప్రార్థితులు.

దుర్గాబాయి,
కార్యదర్శిని, కస్తూర్బా స్మారకనిధి కమిటీ,
మైలాపూరు, మదరాసు.


నాడు నేడు

ఉభయభాషా ప్రవీణ కవితావిశారద అట్లూరి వెంకట సీతమ్మగారు.

సోదరీ, నా కలమొకసారి ముప్పదేండ్లు వెనుకకు పోనిస్తాను. ఆ నాటి కన్నెపడుచు మనస్సు పెళ్లి విషయాల్లో యేలా ఉందో నాకున్న విద్యాసాంఘిక పరిచయాన్ని బట్టి బయటపెడ్తాను, గమనించు. ఆ నాటి రోజుల్లో ఆడవాళ్లలో చదువు చాలా కొద్ది. కొన్ని పల్లెల్లో, కుటుంబాల్లో దాని వాసనైనా లేదు. ప్రపంచమంటే యేమిటో, ఎన్నెన్ని వింతలున్నాయో, విశేషాలున్నాయో, విడ్డూరాలున్నాయో తెలిసికొనే జ్ఞానమేలేదు. ఊహ పుట్టదాయె, ఏదో యింటిలో ఇంత చాకిరీ చేస్తే చేయటమూ, లేకపోతే తిని పడుకోటమూ, మరే యాలోచనా లేదు. తన పనేమీ చింతించే యవసరమూలేదు. తల్లిదండ్రులిచ్చే గుడ్డ కట్టి, వారు పెట్టే తిండితిని, వారాజ్ఞాపించే పనిచేసి, వారు నిర్ణయించే భర్తకు భార్యయై వారింటినుండి పంపిన నాడత్తింటికివెళ్లి యక్కడ వచ్చే కష్టసుఖాలు పూర్వజన్మకర్మాలని తృప్తిపడి బ్రతుకుటయై యున్నది. ఆ భర్త గ్రుడ్డేకాని కుంటికాని, రోగికాని, నిరోగికాని, అందగాడుగాని అందహీనుడుగాని, ధనికుడుగాని, దరిద్రుడుగాని, గుణవంతుడుగాని, గుణహీనుడుగాని, ముసలితొక్కగాని, నవయౌవనుడుగాని, పెళ్లి చేశారంటే కిమ్మనకుండ ప్రేమించవలసినదే. వివాహకాలానికి కన్నె వయస్సు వచ్చి మంచీ చెడ్డల తెలిసికోగల సత్తా గలదైన నామె యిష్టపడుగుటగాని, అడిగే యవసరమున్నదని యూహించుటగాని లేనేలేదు. ఒకవేళ యెవరో యరుదుగా తనకు నిర్ణయించిన వరుడు తన కయిష్టుడని ప్రాణాలు బిగబెట్టుకొని వెల్లడించే ధీరచిత్తం కనంబడిందో దాన్ని రాచి రంపాన పెట్టేవారు, తిట్టేవారు, సంఘమంతా దూషించేది. ఆ కన్నె తన యదృష్టమని సరిపెట్టుకొని తాను కట్టుకొన్న భర్తతో నయోగ్యుడైనా భూలోక నరకమనుభవిస్తూ జీవితము వెళ్లబుచ్చేది? ఇది యెంత విషాదము?

ఇక నా కలాన్ని నేటిరోజులకు త్రిప్పుతాను. ఈ ముప్పదేండ్లలో నెంత మార్పో చూడండి. నేటి కన్య తన జీవితాన్ని తానే నిర్ణయించుకోగలదు. ప్రపంచములో నే మూల నేది జరుగుతోందో తెలిసికొనే విజ్ఞానాన్ని చాలవఱకు సంపాదించుకొన్నది. గొప్పవిద్యలు నేర్చి స్వయం సహాయకర్మ చేస్తుంది. వివాహమంటే యెవరో పెద్దలు చేరి వారి స్వలాభానికో, వినోదానికో చేసే బొమ్మల పెళ్లి కాదనీ, స్త్రీ పురుషులా జన్మపర్యంత మనుభవించే కష్టసుఖాలకీ, శాంతిసౌఖ్యాలకీ స్థానమనీ గ్రహించింది. తాను వివాహమాడే పురుషుడు తన గుణాలకీ, ఆశయలాకీ, సరిపోయి జీవిత నౌకాయాత్రకు సరిసమాన బాధ్యత గలవాడై యుండాలి. ప్రేమ, జాలి, కరుణ మున్నగు నుదారాశయాలు గల్గియుండాలి. అట్టి వరుని తానే ఎన్నుకోవాలి, తన కోర్కెను బట్టి తల్లిదండ్రులు, కులపెద్దలు, పెండ్లిచేయాలి. నా వివాహ విధికి నాకే సర్వ స్వాతంత్ర్యమున్నది అనే జ్ఞానాన్ని తెలిసికొని, ధైర్యముతో పెద్దల ఎదుట పలికి చెలామణి చేయుచున్నది. అందరూ దీనికి ఆమోదిస్తున్నారు? ఆహా! ఎంతమార్పు నాటికి, నేటికి? స్త్రీలకెంతయు యభ్యుదయము గల్గినది.

సోదరీమణులారా, దేశకాల పాత్రముల గమనించి మీమీ శక్తులను, యుక్తులను, విజ్ఞానమును ప్రదర్శించి మహోన్నతి నందుదురుగాక, సంఘములోని లోపముల సవరింతురుగాక!



స్త్రీలు శక్తిలేనివారు గనుక రావుకమిటీ ప్రసాదించిన హక్కులు నిరాకరించాలా?

శ్రీ చంద్ర సావిత్రీదేవిగారు.

15-11-44 తేదీ 'ఆంధ్ర మహిళ' సంచికలో రావు కమిటీ ప్రతిపాదనలను గూర్చి, శ్రీ కె. రంగనాథ అయ్యరు, ఎం.ఏ., బి.ఎల్., గారి వ్యాసం ప్రకటించ బడింది. దానిలో ఈ క్రింది విధంగా చెప్పబడింది.

"భర్త, భార్యవున్నప్పటికీ మరొక స్త్రీతో వ్యభిచారం సాగిస్తే, ఈ 'ఒకే భార్య' నిర్బంధము వల్ల కలిగే ప్రయోజనం ఏమిటీ? భార్య భర్తను విడిచి పెడుతుందనుకుందాం. అలాచేసినందు వల్ల ఆ స్త్రీ పరిస్థితి చక్కబడటానికి క్రొత్త అవకాశం ఏమి కలుగుతుంది? ఒకవేళ ఆమె పునర్వివాహం చేసుకుంటే పరిస్థితి అనుకూలం కావచ్చునేమో. అలా చెయ్యడం కొందరికి ఇష్టంకాక పోవచ్చు. అటువంటప్పుడు ఆమెకు, న్యాయ స్థానములో అధికార పూర్వకంగా భర్తనుంచి విడాకులు పొందిన స్త్రీకి ఏమీ భేదం ఉండదు. ఇంకా ఒక విధాన నష్టమే. అలా భర్తను విడిచి పెట్టే స్త్రీ, భర్త ఆస్తిలో హక్కు కోల్పోతుంది. మనోవర్తి అవకాశాలను నష్టపడుతుంది. ఇవి చాలా మందికి ముఖ్యమైనవి."

ఇప్పుడు రావు కమిటీ తీసుకు వచ్చిన విడాకుల చట్టం ప్రకారం, ఏ స్త్రీ అయినా విడాకులు తీసుకుంటే తన భర్త ఆస్తిలో హక్కును, మనోవర్తి అవకాశాన్ని కూడా కోల్పోతుందనీ, అందు వల్ల స్త్రీలకు ఇది చాలా నష్టాన్ని కల్గించుతుందనీ, ఈ చట్టంవల్ల ఉపకారంకంటే అపకారమే ఎక్కువగా ఉన్నదనీ వ్యాసకార్తగారు వ్రాశారు! కాని రావు కమిటీ వారు తమ చట్టం ప్రకారం విడాకులిచ్చిన స్త్రీకి ఇండియన్ డైవోర్సు యాక్టులో వున్న హక్కులు ఉంటాయని చిత్తు చట్టములో స్పష్టంగా వ్రాశారు. ఇండియన్ డైవోర్సుయాక్టు ప్రకారం ఏ స్త్రీ అయినా భర్తనుండి విడాకులు తీసుకోవాల్సిన అవసరం ఉన్నప్పుడు, భర్తతనను పెడుతున్న బాధలన్నీ కోర్టులో చెప్పి, తను విడాకులు తీసుకోవటానికి భర్త యే కారకుడని రుజువు చేస్తే, ఆమె మళ్ళీ వివాహం చేసుకునేటంతవరకూ, భర్త ఆస్తిలో మనోవర్తికి హక్కు ఉంటుంది.

కాని ఇప్పుడు అమలునందున్న హిందూ లా ప్రకారం, భర్త, భార్యను కష్ట పెడుతూ వుంటే ఆమె అతనినుండి విడిపోయి, దూరంగా ఉండి మనోవర్తిని అడగటానికి అవకాశం ఉన్నది. కాని విడాకులు తీసుకోవటానికి అవకాశము లేదు. ఈ రోజులలో ఎంతోమంది పురుషులు దుర్వ్యసనాలపాలై, తమ భార్యలను తన్నటం, తాము తీసుకొని వచ్చి పెట్టుకున్న ఉంపుడుకత్తెలకు దాసీ తనం చేయించటం, ఇంకా ఎన్నోరకాలుగా జరుగుతున్నది. కొంత మంది తల్లి దండ్రులు ఆస్తులకు ఆశపడి తమ ముద్దుబిడ్డలను, కుష్ఠురోగులకు, పిచ్చవాళ్ళకి, ముదుసలులకు ఇచ్చి పెండ్లి చేస్తున్నారు. అలాంటి స్త్రీలు విడాకులు తీసుకుని మళ్ళీ ఇంకొక వివాహం చేసుకోవాలంటే మనకు ఇప్పుడున్నలా ప్రకారం అవకాశము లేదు. అందు వల్ల కొంత మంది స్త్రీలు ఈ నరకబాధల నుండి తప్పించుకొని సుఖపడాలంటే ఈ విడాకుల చట్టం అమలులోనికి వచ్చినప్పుడే సాధ్యపడుతుంది.

స్త్రీ అశక్తురాలుగనుక, పురుషుడు ఎంత దుర్మార్గుడైనా సరే, ఎన్ని బాధలు పెడుతున్నా సరే, తిండి కోసం ఆ బాధలన్నిటినీ సహించుతూ, పడి ఉండాలని కూడా వ్యాసకర్తగారు అన్నారు. వీరు ఈ విధంగా చెప్పటం వల్ల, అసలే మనకు ఈ కష్టాలనుండి విముక్తి లేదనీ, ఇలా బాధపడాల్సిందేననీ, భయపడుతున్న స్త్రీలకు ఇంకాపిరికితనాన్ని బోధించిన వారవుతున్నారు. కాని అది సరి అయినది కాదు. స్త్రీలు కూడా స్వయం పోషకంగా ఉండాలి. ఏ వైనా వృత్తులు నేర్చుకుని స్వతంత్రంగా బ్రతకాలి. అలా వారు వృత్తులు నేర్చుకోవటానికి మనం అవకాశాలు కల్పించటానికి ప్రయత్నం చేసి ప్రోత్సహించాలి. అంతేగాని భర్త ఎన్ని కష్టాలు పెడుతున్నప్పటికీ,

రోజూ తన్ని బయటికీడుస్తున్నప్పటికి, వాటన్నిటినీ సహించుతూ, ఆత్మాభిమాన్ని చంపుకుని పడి ఉండ మనటం సమంజ సంకాదు. స్త్రీలు కూడా తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవాలంటే తమ కాళ్లమీదతాము నిలబడాలి.

"ఇప్పుడున్న రీతిలోనే చట్టం వస్తుందనుకుందాం. అయితే మన దేశములో ఒక భార్య ఉండగా—వేరొక స్త్రీని భార్యగా గొనివచ్చినవారు నూటి కెందరు? భర్తలు కొత్తగా మరొక స్త్రీని సతిగా స్వీకరించినప్పుడు, మొదట్లో వున్న భార్యలలో విడాకులకు ప్రయత్నించినది నూటి కెందరు?

ఇతర దేశాలలో అమలులో వున్న ఏక పత్నీత్వవివాహాల చరిత్ర ఏ విధంగా వున్నది? అవి సతీపతుల జీవితాలను నిరవధిక సుఖభాజనం చేసిన వని నిశ్చయంగా చెప్పటానికి అవకాశం ఉన్నదా?" అన్నారు.

ఒక స్త్రీ ఉండగా ఇంకొక స్త్రీని వివాహం చేసుకున్న పురుషులు నూటికి కొద్ది మందే ఉండవచ్చు. అలా కొద్ది మంది చేసు కోవటం వల్ల కూడా స్త్రీలకు నష్టంకలుగుతున్న ది. పిల్లలు పుట్టలేదనో, కట్నము సరిగా ఇవ్వలేదనో, లేక ఆమెరూపసి కాదు గనుక తనకు ఇష్టంలేదనో, అతని తల్లికి గాని, తండ్రికి గాని ఆ కోడలంటే ఇష్టంలేదనో కొంతమంది పురుషులు ఒక భార్యవుండగా మరొక స్త్రీని వివాహం చేసుకుంటున్నారు. అలా ఇంకొక స్త్రీని వివాహం చేసుకుని కూడా మొదటి భార్యకు మనోవర్తి ఇవ్వకుండా కోర్టుకు రప్పించి నానా అవస్థలూ పెడుతున్నారు. అలాంటి వారికి బహు భార్యా నిషేధ చట్టం గనుక ఉన్నట్లైతే రెండో వివాహానికి అవకాశం లేకుండా పోతుంది. అప్పుడు స్త్రీ పురుషు లిద్దరూ సుఖంగా ఉండటానికి అవకాశం ఉంటుంది. అంతే గాని ఒక భార్య వుండగా, ఇంకొక స్త్రీని వివాహం చేసుకునే పురుషులు ఎక్కువ మంది లేరుగనుక అసలు చట్టమే అవసరము లేదని వ్యాసకర్తగారు అనటము సమంజసముగాలేదు.

ఒక వేళ పురుషులు ఒక భార్యవుండగా ఇంకొక స్త్రీని వివాహం చేసుకున్నప్పుడు, మొదటి భార్యల్లో ఎక్కువ మంది విడాకులకు ప్రయత్నించుట లేదుగనుక, విడాకుల చట్టము అనవసర మని వ్యాసకర్తగారు అంటున్నారు. పురుషులు ఒక భార్య ఉండగా ఇంకొక స్త్రీని వివాహం చేసుకుంటే, ఆ మొదటి భార్యల సందర్భ్నీ విడాకులు ఇవ్వమని బలవంతం చేయగూడదు. కాని మేము ఆ విధంగా ఉండలే మనీ, విడాకులు తీసుకుని దూరంగా ఉంటా మని అనే వారికి కూడా ఇప్పుడున్నలా ప్రకారం అవకాశము లేదు. అందు వల్ల అలాంటి స్త్రీల కొరకు విడాకుల చట్టము కావాలని మేము కోరుతున్నాము. విడాకుల చట్టం ఉంటే, కష్టాలు పడే వారికి వాటినుండి విముక్తి పొందటానికి అవకాశము ఉంటుంది.

ఇతర దేశాలలో స్త్రీలకు మన దేశములో కన్న ఎక్కువహక్కులు ఉన్నవి గదా? ఆ దేశాల స్త్రీలు మన దేశ స్త్రీల కన్నా ఎక్కువ సుఖంగా ఉంటున్నారా? వాళ్ళకేమీ కష్టాలు లేవా అని వ్యాసకర్తగారు అంటున్నారు. కాని మన దేశ స్త్రీల కంటే పాశ్చాత్య దేశాల స్త్రీలు చాలా సుఖంగానే వుంటున్నారు. వారిలో ఎక్కువ మంది స్త్రీలు చదువుకున్నారు. పొట్ట కోసంపురుషుల మీద ఆధారపడుట లేదు. ఏదో ఒక వృత్తి నేర్చుకొని, వారి జీవితాన్ని వారే పోషించుకో గల్గుతున్నారు. ఇప్పుడు పాశ్చాత్య దేశాలలోని పురుషులంతా యుద్ధరంగములోనికి వెళ్ళి యుద్ధం చేస్తుంటే, దేశములో వారు లేని కొరత కొంచెంకూడా ఉండకుండా అక్కడి స్త్రీలు పెద్ద పెద్ద ఫ్యాక్టరీలలో పాల్గొని వారికి కావాల్సిన ఆయుధసామగ్రీ, ఆ హారపదార్థాలు ఉత్పత్తి చేసి సప్లయి చేస్తున్నారు. కొన్ని కొన్ని ప్రదేశాలలో విమానాలు నడపటం, నౌకాదళంలో చేరిపని చేయటం, అవసరమైనప్పుడు సైన్యంలో చేరి యుద్ధ రంగంలోనికి వెళ్ళి యుద్ధం సాగించడంకూడా చేస్తున్నారు. ఎంతో మంది స్త్రీలు డాక్టర్లు గాను, నర్సులుగాను ట్రైనింగు పొంది, యుద్ధరంగములో గాయ పడిన వారికి చికిత్స చేస్తున్నారు. ఈ విధంగా పాశ్చాత్య దేశాలలోని స్త్రీలు తమ గృహ విషయాలలోనే కాకుండా, దేశ పరిస్థితులలో కూడా భాగం తీసుకొని పని చేసి, దేశాన్ని సంరక్షించుకో గల్గుతున్నారు.

ఇక మన దేశ స్త్రీల స్థితి చూచుకుంటే, బాహ్య ప్రపంచం ఎలావుంటుందో తెలియదు. ఏ చిన్న పని కావాల్సినా పురుషుల మీద ఆధార పడతారు. వాళ్ళ స్వశక్తి మీద ఆధార పడ లేరు. ఈ రోజులలో ఏదైనా పోరాటం మన దేశములో కూడావస్తే ఆ దేశ రక్షణ విషయాలలో పాల్గొన లేక పోయినా, తమ స్వరక్షణ కూడా చేసుకో లేరు. తమ కుటుంబాన్ని కూడా నిర్వహించుకో లేరు. అందు వల్ల స్త్రీలకు, ఆస్తి హక్కులు, వివాహము, విడాకులు మొదలైన హక్కులు వస్తే ఇప్పటి కంటే స్త్రీలలో చాలా మార్పు వస్తుంది. స్త్రీలు కూడా కొంత స్వేచ్ఛను పొంది బాహ్య ప్రపంచాన్ని అర్థం చేసుకుంటారు. ఏదైనా బరువుకాని వృత్తులు నేర్చుకుని, తమ్ముతాము పోషణ చేసుకోగల్గుతారు.

విడాకులు అవసరం లేని, "సతీ పతులు తమ జీవితాలను పరస్పరము అంకితం చేసుకొని సుఖమయ జీవితం గడిపేసామాజిక వ్యవస్థ" కొరకు కృషి చేద్దా మన్నారు, వ్యాస కర్తగారు. ఇది నిజమే. దీనికి మేమూ ఒప్పుకుంటాం. కృషి చేస్తాము. కాని అలాంటి సామాజిక వ్యవస్థ వచ్చేటంతవరకూ ఈ కుళ్ళు సమాజములో ఇలాగే ఉండాలనటములో అర్థములేదు. ఇప్పుడు హిందూ సమాజములో వున్న కుళ్ళును కొంత వరకూ తొలగించి రావు కమిటీ కొన్ని అభివృద్ధికరమైన మార్పులు తీసుకు వచ్చింది. వాటిని మన మందరము బలపర్చాలి. ఎన్నో సంవత్సరాలనుండీ ఆందోళన చేస్తూవుంటే ఇప్పటికి ప్రభుత్వం స్త్రీల విషయములో ఈ కొద్ది మార్పులు తీసుకు వచ్చింది. ఈ అవకాశాన్నికూడా వినియోగించుకుంటూ, ఇంకా కొత్త మార్పుల కొరకు ప్రయత్నించుదాము.

ఇలా స్త్రీలలో వ్యక్తిత్వము, స్వాతంత్ర్యకాంక్షలు కలుగ జేసి, సతీ పతులు విడాకులు అవసరం లేకుండా; సుఖమయ జీవితము గడిపే సమాజ వ్యవస్థను నిర్మించటానికి, స్త్రీలను ముందుకు తీసుకురావాలి.

దోచుకునే వారు, దోపిడీ చేయబడేవారు లేకుండా, అందరూ సమానంగా కష్ట పడి, సమానంగా అనుభవించాలి. అంతే కాకుండా ప్రజలందరితోను ఎన్నుకొనబడినటువంటి ప్రజా ప్రభుత్వ ముండాలి. దేశములోని ఆర్థికసంపత్తి అంతా ప్రజలందరిదీ అయివుండాలి. చదువుకునే అవకాశాలు, తిండీ, బట్టా, స్త్రీ పురుషులందరికీ ఉండాలి. ఏ దేశములోనైనా ఆ విధంగా సమాజ వ్యవస్థ మారినప్పుడే స్త్రీ, పురుష లిద్దరికీ సమానమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభిస్తాయి. స్త్రీ, పురుషులు విజ్ఞానాన్ని సంపాదించుతారు. జాగ్రత్తగా ఆలోచించి, తమకు తగినవారిని వివాహం చేసుకుంటారు. ఆ వివాహానికి ప్రేమయే పునాదిగా ఉంటుంది. ఆ పరిస్థితులలో విడాకుల అవసరము బహుకొద్దిగా ఉంటుంది. అలాంటి సమాజ వ్యవస్థను మన దేశములో కూడా తీసుకు రావాలి అంటే, మన దేశములోని స్త్రీలు, పురుషులు అందరమూ కలిసి పని చెయ్యాలి. కాని ఈ లోగా చట్టాల ద్వారా సాధ్యమైనంత వరకూ స్త్రీల హక్కులు సాధించి, హిందూ సమాజాన్ని బాగు చేయటానికి కృషి చేయటం అందరి కర్తవ్యమూను.

★



సోవియట్ రష్యాలో మాతృత్వము :

రచన
శ్రీ యలమంచిలి బాలకోటేశ్వరరావుగారు.

"ప్రకృతిలో తల్లిని సుఖ పెట్టుట కంటె గొప్పకార్య మేమియును లేదు. తల్లిని సుఖపర్చడమంటె జాతి సౌఖ్యాన్ని ఎక్కువ జేయడమవుతుంది. ఏ స్త్రీ తన యొక్క మాతృత్వ సౌఖ్యాన్ననుభవించదో, ఆ స్త్రీ, తన కర్తవ్యము యొక్క గొప్పతనాన్ని తెలుసుకొని నిర్వహించుట అసాధ్యము" అనే సోవియట్ ప్రధానాశయమును తెలుసుకుంటే, సోవియట్ రష్యాలో "మాతృత్వము" ఎంత ప్రాధాన్యత వహించి, గౌరవించబడుతున్నదో తెలుస్తుంది.

ఈ ప్రధాన ఆశయము, పతనావస్థలోనున్న భారత స్త్రీలకు దిగ్భ్రమ కల్గించదా! మాతృత్వమును గౌరవించాలనే ముఖ్య సూత్రము మనకు లేదు. ఈ నాటి స్త్రీల జీవితము, హింసా సంఘటనలనుండి విముక్తి జెందేమార్గము లేదా? బాల్యదశలోనే మరణాలకు గురియగు పద్ధతుల ననుసరించే భారత జాతికి ఆదర్శ ప్రాయమైనది సోవియట్ రష్యా. పిల్లలు జన్మించునపుడు మరణించుటవల్లగాని, ప్రసవ సమయ మందు నానా బాధలకు గురియగుచున్న తల్లుల నికృష్టజీవిత ఫలితంగాగాని, మన దేశములో పిల్లలు బలహీనంగాను, అనారోగ్యంగాను వుంటున్నారు. తినుటకన్నము లేక, దిగంబరలైన స్త్రీలు మన దేశంలో, తమ యొక్క పిల్లలను, కంటి గ్రుడ్డివాళ్లుగజేసి, అడుక్కుతినే వృత్తికవలంబించుతూన్న పద్ధతులను మార్పుజేయుటకు, ఆకలి మంటలనివారించి, విముక్తి జేయడానికి మార్గము లేదా? ఈ సమస్య కష్టతరమైనదే! చికాకును గల్గించేదే. కాని నిర్లక్ష్యము జేస్తే ఏంజరుగుతుంది? దేశాన్ని ఇంకా బానిసత్వములో మ్రగ్గేటట్లు జేస్తుంది. మన పిల్లలను దౌర్భాగ్య జీవితాలకు గురిజేస్తూ, జాతినింకానిస్సారం జేస్తుంది. ఈ నాటి మన హీనపరిస్థితులే సోవియట్ రష్యాలో విప్లవానికి ముందుండేవి.

విప్లవానంతరము సోవియట్ యూనియన్, తల్లుల, పిల్లల సౌకర్యాల విషయములో జాగ్రత్త తీసుకొనుట ప్రధాన కర్తవ్యముగా భావించింది. ఆబాధ్యత తీసుకుంది. అనేక మాతృమందిరాలు, విశ్రాంతి భవనాలు, క్రెచీలు, కిండర్ గార్డెన్సు, ప్రసవించాల్సిన స్త్రీకి డెబ్బది ఏడు రోజులు సెలవులు, ఆరు గురుపిల్లలుగల తల్లికి ప్రత్యేక ధన సహాయము జేస్తూ, సోవియట్ యూనియన్ అద్భుతంగా మాతృసేవ జేస్తోంది.

చాలకొద్ది కాలము క్రిందట, వీలైనంత ఎక్కువగా తల్లులకు, పిల్లలకు, సహాయం చేయాలనే శాసనాన్ని ప్రభుత్వము అంగీకరించింది. పిల్లలు పుట్టిన వెంటనే, వారికి కావలసిన సౌకర్యాల కొరకు భీమా నిధిని, పరస్పర సహాయ నిధిని ఏర్పాటు జేసి, వసతులు కల్పించి సహాయం జేస్తున్నది. పూర్వము కిండరుగార్డెన్లకు, క్రెచీలకు చెల్లించాల్సిన మొత్తములో సగము ప్రభుత్వము భరించుటకు నిర్ణయించింది. ఎందు వల్లనంటే యీ యుద్ధకారణంగా, తల్లి దండ్రుల సంపాదన తగ్గుతుందని, జీవించుటే దుర్భరమని ప్రభుత్వము గ్రహించింది. తల్లులకు, పిల్లలకు, రోగులను, పిల్లలను సంరక్షించే పరిచారకత్వమువలన బలహీనపడే నర్సులకు, విశ్రాంతి భవనాలను అదనంగా, అతి తొందరగా, అనేకము నిర్మించింది. యంత్ర పరిశ్రమను పునర్నిర్మించే కార్యక్రమములో, పిల్లల కవసరమైన చొక్కాలు, మేజోళ్లు, ఇతర పరికరాలను, ఎక్కువగా వుత్పత్తి జేసే ఫ్యాక్టరీలుండాలని, విశ్రాంతి రోజుల్లో తల్లుల సౌఖ్యాని కవుసరమైన పరికరాలు లభించే దుకాణములు ఎక్కువగా స్థాపించాలని, ప్రజా శాసన సభ సూచనలిస్తోంది.

అప్పుడప్పుడుగాని, ప్రతి నెలాగాని, అప్పు తీర్చే పద్ధతిలో, తల్లులకు ధన సహాయం ప్రభుత్వం జేస్తుంది. ముగ్గురు పిల్లలుగల తల్లికి నాలుగు వందల రూబుల్సు. నలుగురు సంతానంగల తల్లికి అప్పుగాకుండా, వుచితంగానే సంవత్సరానికి 1300 రూబుల్సు ఇవ్వబడుతుంది. ఈ విధంగా చెల్లించే ధనము తల్లికి పది మంది పిల్లల కలిగేవరకు సంవత్సరానికి 5,000 రూబుల్సు, ఒక్కొక నెల ప్రతీ పిల్లకూ మూడువందల రూబుల్సు చొప్పున పెంచుతారు. ఈ శాసనమే ఇంకొక ప్రక్క స్త్రీ ప్రసవ సమీపకాలములో, పూర్తి జీతముతో,

77 రోజులు సెల విస్తూ, ఎక్కువ గంటల పనిని, రాత్రులందు పని చేయకూడదని నిషేధిస్తూ, ప్రత్యేకాహారము లభించునట్లు చేయాలని శాసించింది.

సోవియట్ రాజ్యము వ్యభిచారాన్ని అక్రమచర్యగా ప్రకటించి, సక్రమ మార్గాలద్వారా వ్యభిచారనిర్మూలనముకు తోడ్పడుతూ ప్రశంసా పాత్రమైంది. విడాకులిచ్చే అవకాశాలు సోవియట్ యూనియన్‌లో ఉన్ననూ, వాటిని ప్రోత్సహించదు. విడాకు లిచ్చిన తరువాత కూడా స్త్రీ యొక్క మాతృత్వమును స్థిరపర్చుకునే అవకాశాలు కల్గించింది. దేశమందుతన కర్తవ్యాన్ని నెరవేర్చుటకొప్పుకుంటూ, సంతానం యొక్క భవిష్యత్తు కొరకు, మరల వివాహం లేకుండా, సంతానానికి 12 సంవత్సరాలు వచ్చేవరకు అవివాహితగా వుంటే, ఆ తరువాత పెండ్లి చేసుకోవచ్చు. ఇలా వివాహం గాని తల్లులు, పిల్లల కొరకు ఏర్పరచిన ప్రదేశాలలోనికి తమపిల్లలను తీసుకోమని కోరితే, ప్రభుత్వము పూర్తి బాధ్యత తీసుకోవడముగాని, అటువంటి అవకాశాలు కల్పించడముగాని జరుగుతుంది. మరలకొంత కాలము జరిగినప్పటికీ, ఆ తరువాత తన యిష్టము వచ్చినపుడు తల్లి, తన పిల్లను తనవద్దవుంచుకోవచ్చు,

ఈ నూతన శాసనము ఇంకొక ముఖ్య విషయాన్ని కూడా చట్టములో జేర్చుతోంది. బ్రహ్మచారులుగా వుండేవారి వద్ద ఎక్కువ పన్నువసూలు జేస్తుంది. అది సరియైనదే! ఎందు వల్లనంటే సామాన్యముగా ప్రతి వాని జీవితము సౌఖ్యముగా గడపుటకు అనేక అవకాశాలు గల్గించి, దేదీప్యమానంగా జాతిని వికసించే మార్గాలున్నప్పుడు, అది అసహజంగా కన్పడదు.

సోవియట్ యూనియన్, ఏ విధంగానైనా, ఆరుగురు పిల్లలు కల్గిన తర్వాత, ఏ తల్లికైనా తన పిల్లలను పోషించుట అసాధ్యమైన పనిగా వుందని తెలుసు కొంటే, వారిపోషణకు ఆ తల్లికి సాధ్యమైనంత సహాయంచేస్తోంది. స్త్రీ యొక్క సంతానికి సౌకర్యాలు కల్పించి, సంతోష పర్చడమే ప్రభుత్వ ఆశయం. ప్రభుత్వం మెప్పుపొందిన చిహ్నంగా, తన మాతృత్వము అతి ప్రాముఖ్య కర్తవ్యంగా భావించునట్లు ఆరుగురు సంతానముగల తల్లికి, అయిదు గురు పిల్లలుగల తల్లికి "మాతృత్వ పతాకాన్ని" మొదటి, రెండవ బహుమానాలుగా ఏర్పరచింది. "ఆర్డర్ ఆఫ్‌మదర్ గ్లోరీ" అనే బిరుదును, గౌరవచిహ్నంగా, మూడుతరగతులుగా ఏడు ఎనిమిది, తొమ్మిది, మంది సంతానముగల స్త్రీలకిచ్చుటకు నిర్ణయించింది. పది మంది పిల్లలనుగని, పెంచి, తనకర్తవ్యాన్ని అత్యద్భుతంగా ఏ స్త్రీ నెరవేర్చుతుందో, ఆ స్త్రీ "వీరమాత" యనిబిరుదు పొందుతోంది.

సుప్రీం సోవియట్ కౌన్సిలు, తల్లులకు, పిల్లలకు పై విధంగా సహాయంచేయాలనే శాసనాన్ని ప్రకటించింది. శాంతికాలములో కాదు--యుద్ధం జరిగే ప్రస్తుతపు రోజుల్లోనే అంగీకరించి, సోవియట్ యూనియన్, తన యొక్క భావిపౌరుల జాగ్రత్త తీసుకొని, జాతిని విశాల పర్చుటకు కృషిజేసి జయం పొందుతోంది.

[చిత్ర నాయక్ రచన ననుసరించి]

★

★

పతిత

శ్రీమతి
కె. నాగేంద్రమ్మగారు

కమల ఒక రోజున తన చెల్లెలికి చీర కొనిపెడదామని బజారుకు బయలు దేరింది. రోడ్డుకు ప్రక్కగా పరధ్యాన్నంగా నడచిపోతుంటే కుక్కలు భౌ భౌమంటూ బిగ్గరగా అరవడం మొదలు పెట్టినవి. ఇక కమలమ్మగారిగుండె తపీమని ఆగినట్లయింది. కుక్కలు కూడ తన జీవితాన్ని చూసి అసహ్యించుకుంటూ తనను యెగతాళి, అపహాస్యం చేస్తున్నవన్నట్లుగా భావించింది. మళ్లీ కొంచెం తెప్పరిల్లుకొన్న తరువాత తన జీవితాన్ని, పరుల అపహాస్యాన్ని, కుక్క భౌమన్నందుకు ఉలికి పడాల్సివచ్చినందుకు విచారించ మొదలు పెట్టింది. మనసు పరి పరివిధాల లాగుతుంది. ఒక్కొక్కసారి తన మనస్సుకు సమాధానం చెప్పుకుంటూ ఇతరులు ఏ పని చేసినా, ఏమనుకొన్నా తనకు అన్వయించుకోవడం చాల తప్పనీ, అంతకంటె తనకు తాను గొయ్యి త్రవ్వుకోవడం ఉండబోదనీ, యీ పద్ధతి తన జీవితానికి వినాశన కరమనీ భావిస్తుంది. కాని పూర్వగాథ, మిత్రులు తెలిసినవారు తనను అర్థం చేసికోకుండా ఆడిపోసేమాటలు జ్ఞాపకానికి వచ్చి ఒక్కసారి కలత పెట్టేవి. అంతటితో రగుల్కొనేది అగ్ని. దీనికి సమాధానం లేదు. జవాబుగా తన జీవితాన్ని నిందించుకొనేది. చల్లని బాష్పాంజలి మాత్రం ఎంతో ఆప్యాయంగా ఆప్తబంధువుని గూడ మించి ఆ అగ్నిని కొంతవరకు శాంతపరచేది.


అవును. ఎందుకీ వ్యథ ? ఎందుకీ తేనిపోని ఆవేదన కమలకి ? ఎవరు తెచ్చిపెట్టారు ? కమల తన జీవితంమొత్తంమీద తాను ఆశించింది ఒక్కటే. ఒకరిని ప్రేమించాలని గాదు. మిత్రులు కావాలని కాదు. అది తనను ఎవరైనాసరే అపహాస్యం చేయకుండా, నిందించకుండా, కనీసం గౌరవాన్ని చూపిస్తేచాలు అనిమాత్రం. ఆమె ఎన్నిసార్లు ఆశించింది. చివరకు చేసుకున్న భర్తనుంచి గూడ కోరింది ఆమె యిది ఒక్కటే. ఆమెకు ఎల్లప్పుడు ఒక్కటి మాత్రం జ్ఞాపకం వచ్చేది. చిన్నతనంలో తన యింటివద్ద పొరుగు స్త్రీలు పోట్లాడుకుంటూ అనుకునేవారు. "చేసికొన్న మొగుడు ముండా అంటే, ముష్టికొచ్చి వాళ్లుగూడ ముండా అని అన్నారట." ఆ సామెత ఆమె చెవుల్లో గింగురుమంటూ ఉండేది. చేసుకున్న భర్త సమర్థుడైవుంటే, ఆయన గౌరవనీయుడై యుండి, పలుకుబడి వున్న వాడైతే ఎలాంటి చిక్కులు రావు యీ బానిస సమాజంలో. నిజమే ! స్త్రీకి వ్యక్తిత్వం రానంతకాలం, వ్యకిగత హోదా, సమర్థత లేనంతకాలం భర్తగౌరవం మీదే ఆధారపడి వుంటుంది భార్య యొక్క గౌరవం. మామూలుగా కలెక్టరుగారి భార్య క్రింద తహసీల్దారుగారిభార్య లోకువే. తహసీల్దారు భార్య క్రింద రివిన్యూ ఇన్స్పెక్టరు గారి భార్యగాని, తక్కువ ఉద్యోగస్థుల భార్యలుగాని లోకువౌతున్నారు. ఎందువల్ల ? భర్తలు పెద్దహోదాలో నున్న, వారు ఎక్కువ గౌరవానికి అర్హులౌతారు. నేనీమధ్య ఒక ప్రొఫెసరు భార్యతో స్త్రీ సంఘాలనిగూర్చి వాదిస్తుంటే ప్రక్కనున్న బానిసభావాలు గల స్త్రీలు ఏమంటున్నారో తెలుసా ? "మీరు ఆమెతో వాదించలేరు సుమా ! ఆమె ఎవరనుకున్నారు ? ప్రొఫెసరు గారి భార్య. లాప్రకారంగా మాట్లాడుతుంది. మీరు ఆమెకు సమాధానం యివ్వలేరు."

కమల వ్యథపడేదికూడ దీనికోసమే. భర్త తక్కువ ఉద్యోగి. దీనితోబాటు మాటకారిగాదు. గౌరవం తక్కువ. ఎక్కువ పలుకుబడి లేదు. అందరూ హాస్యంచేస్తూ తమ వినోదానికిగాను ఉపయోగించుకొంటూ ఉంటారు. పైపెచ్చు భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు. ఇంకేం, చుట్టూ ఉండే కుళ్ళు సమాజానికి చక్కని కబుర్లపోగు తయారైంది. తిన్న భోజనం సక్రమంగా జీర్ణిస్తుంది. కాలం త్వర త్వరగా గడిచిపోతుంది. ఇతరుల ఆనందానికి మేరలేదు. సంగతి సందర్భాలు ఎలావున్నా మొదట ఎర అయేది ఎవరు ? స్త్రీ. వెనకా ముందూ లేదు. విషయాలు తెలియని చెవిటివాడైనా ఇదే మాటాడుతాడు. కమల చదువుకొన్న మనిషి. చదువు మూలంగా, తెలివితేటలు మూలంగా, సాహసము గూడ కలుగుటచేత ఆమె పరిచయస్థుల్లో మంచి పలుకుబడి ఉండేది. అందరూ ఆశ్చర్యంగా చెప్పుకొనేవారు. మంచిదని అని అనుకునేవారు. జీవితంలో చక్కని వర్చస్సు ఉందనీ, కవయిత్రి

అవుతుందనీ, ఇంకా ఏమేమో గొప్పగా చెప్పుకొనే వారు. బందరులో ఒక డ్రిల్లుమాష్టరు ఉండేవారు. ఈ అమ్మాయి అంటే ఆయనకు ఎంతో ప్రాణం లేచివచ్చేది. వెళ్ళినపుడల్లా ఎంతో సత్కరించే వారు. ఆదరించే వారు. స్వయంగా చెల్లెలి కంటె ఎక్కువగా చూచుకుంటూ ఉండేవారు. కాల చక్రం తిరిగింది. పరిస్థితులు మారినాయి. అమ్మాయి కాపు రానికి అదృష్టరేఖ నిప్పుపుల్ల గీచి వెలిగించింది. అది చూచే టప్పటికి డ్రిల్లుమాష్టరు గారి కళ్లు మిరుమిట్లు గమ్మాయి. దేనికి ? అయ్యో ! అమ్మాయి కాపురం చితికి పోయిందని గాదు. అమ్మాయి మీద రోషంచేత. ఒకరోజున తన పుట్టిం టికి పోతూ దారిలో బందరులో దిగింది. అదివరకు ఆప్యా యంగా పలుకరించిన మాష్టరు ఆమెవంక చూడనైనా లేదు. పలుకరించను లేదు. అప్పటి నుంచి ఇప్పటికి మాటలులేవు.

అప్పటినుంచి అమ్మాయి పేరు పతిత అయింది. ప్రతీవారు పతిత అని పిలిచేవారే. పతితకు ఎక్కడా స్థానం లేదు. ఆమె పతిత అవనీ, అవకపోనీ ఒకరి దృష్టిలో పడ్డదా అంటే అంతా అంతే. మొగుడు తిడితే ముష్టికొచ్చినవాళ్ళు కూడా నిందిస్తారు అందుకే ఆమె వ్యధ. హృదయా వేదన. తనలాగ దుఃఖించే స్త్రీల ఏడుపు ఆమె మాత్రమే వినగలుగుతుంది. అందుకే కుక్క మొరిగినా ఉలికిపడ్డం. దీనికి మందు ఏమిటి ? ఎవరిది తప్పు ? దీనిని నిర్ణయించే దెవరు ?

Edited and published by G. Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras.
Printed by M. Satyanarayana at the Hindi Prachar Press, 12, Thanikachalam Chetty Road, T'Nagar, Madras.



బెజవాడ — మారుతి

రాజమండ్రి — కృష్ణా

బందరు — మినర్వా

గుంటూరు — సరస్వతి

విశాఖపట్టణం — పూర్ణా

వరంగల్ — విక్టోరియా

కాకినాడ — మినర్వా

DISTRIBUTORS FOR ANDHRA, CEDED AND NIZAMS:

MADRAS—BEZWADA—SECUNDERABAD—GUNTAKAL.

For Mysore & Tamilnad: Narasu Pictures Circuit, Madras.